క్లుప్తంగా

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం విక్రయాలు

ప్రత్తిపాడు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్‌దారులు మద్యం విక్రయాలు నిర్వహించాలని ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ కోరారు. లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులకు మంగళవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషనులో ప్రొవిజినల్ లైసెన్సులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసుకునే ప్రదేశాన్ని ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రవీంద్రకుమార్ ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

పొన్నూరు: పట్టణం, మండల పరిధిలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ రమేష్ తెలిపారు. నూతన మద్యం విధానంలో విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. దుకాణాలు ఏర్పాటు చేసే వారు ఆలయాలు, చర్చి, మసీదులు, విద్యాలయాలకు 100 మీటర్ల దూరం పాటించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు.

యోగతో ఆరోగ్యం పదిలం

ప్రత్తిపాడు: యోగతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పెదనందిపాడు రోటరీక్లబ్ అధ్యక్షుడు నల్లపనేని శివప్రసాద్ అన్నారు. ప్రముఖ యోగా గురువు కనపర్తి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పెదనందిపాడు శివాలయం కల్యాణ మండపంలో ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత యోగ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివప్రసాద్ మాట్లాడుతూ యోగను నేటి తరం యువత అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ కాలుష్యంతో ప్రజలు వ్యాధుల బారిన పడి చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నాగూర్, నాగులపాడు సుభిక్ష సోషల్ సర్వీస్ అధ్యక్షులు కొల్లా సీతారామయ్య పాల్గొన్నారు.

పల్లపాడులో పండ్ల మొక్కలు పంపిణీ



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పల్లపాడులో పచ్చదనం పరిశుభ్రతను పెంపొందించేందుకు తోకల వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌తో పాటు ఎస్సీ, బీసీ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కొబ్బరి, సపోట, మామిడి, సీతాఫలం, నిమ్మ మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో నల్లూరి పూర్ణచంద్రరావు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్త కోమటినేని పార్వతి పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై శ్రద్ధ అవసరం

చేబ్రోలు: జిల్లా సమగ్రశిక్ష ఆదేశాల మేరకు మండల స్థాయిలో డెస్లెక్సియా (అభ్యాసన లోపం) పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల యొక్క విద్యావనరుల కేంద్రం(భవిత)లో సమావేశం నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రులకు(అభ్యాసన లోపం)పై అవగాహనకు 2కే వాక్ నిర్వహించారు. ఫ్ల కార్డులు, బ్యానర్లతో అభ్యాసన లోపం గురించి ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు జి.అనూరాధ, జి.రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం



పెదకాకాని: దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నంబూరు శ్రీనాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా ట్రాక్టర్‌పై అలంకరించి నిర్వహించిన గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. నిర్వాహకులు గ్రామోత్సవం సందర్భంగా కళాకారులతో ఏర్పాటు చేయించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పొన్నూరు: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ ఎస్ఐ రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయం కలిగించే విధంగా ఆటోలు నిలపరాదని అన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, మాట్లాడుతూ డ్రైవ్ చేయవద్దని సూచించారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు..

- 'అన్నదాత సుఖీభవ'లేనట్టేనా...!
- ఖరీఫ్‌లో అందని సాయం
- రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- జగనన్న పాలనలో ఠంచన్‌గా రైతు భరోసా
- ఆ ఊసే ఎత్తని కూటమి సర్కార్



రబీ సీజన్‌కు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కాకుమాను: రైతన్నను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభ దశలో సకాలంలో వర్షాలు లేక, సకాలంలో చానల్స్‌కు సాగు నీరు రాకపోవడంతో అనేక కష్టాలు, బాధలు పడి రైతన్నలు వరి నాట్లు వేశారు. తీరా ఎన్నో వ్యయప్రయాసలు పడి సాగు ప్రారంభించిన కష్ట జీవులకు రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా అనేక గ్రామాలలో పంట పొలాలు నీటి మునిగాయి. మండలంలోని పలు గ్రామాలలో వరి పంట ఈనిక దశలో ఉంది. వాయుగుండ ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటపై మానుడుకాయ పడి దిగుబడులు తగ్గే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మాటలకే పరిమితమైన అన్నదాత సుఖీభవ..

ఖరీఫ్ మరో సీజన్ మరో 40 రోజులకు ముగియనుండంతో రైతులు రబీ సీజన్‌కు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ పంట పెట్టుబడికి అందినకాడికి అప్పులు చేసిన రైతన్నలకు రబీ సీజన్‌కు పెట్టుబడులు ఎక్కడ తీసుకురావాలా అని ఆందోళన చెందుతున్నారు .రబీ సీజన్ ప్రారంభం కానున్నప్పటికి ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి ప్రతి రైతుకి రూ.20 వేలు అందిస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఖరీఫ్ సాగు ఇలా..

మండలంలోగ్రామాలలో 8,600 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు.వీరిలో 6,346 మంది రైతులు,2,804 మంది కౌలు రైతులు ఉన్నారు. కూటమి సర్కార్ ఇప్పటికైన వెంటనే సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయాన్ని అందించాలని మండల రైతులు కోరుచున్నారు.

గత ప్రభుత్వంలో ఠంచన్‌గా సాయం...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రతిఏటా సీజన్‌కు ముందుగానే రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ప్రతి రైతుకి అందజేసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాలలో మండలంలో 8,789 మంది రైతులకు గాను రూ.32.95 కోట్లు నేరుగా వారి వారి బ్యాంకు ఖాతాల్లో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా జమ చేసి రైతులను ఆదుకున్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకి కులాలు,మతాలు,ప్రాంతాలు,పార్టీలు చూడకుండా ఏటా రూ.13,500 చొప్పున జమ చేశారు. ఖరీఫ్ సాగు చేసే ముందు మే నెలలో రూ.7,500, పంట కోత, రబీ సాగు అవసరాల కోసం అక్టోబర్‌లో మరో రూ.4 వేలు, పంటకోత సమయం జనవరిలో రూ.రెండు వేలు చొప్పున ఠంచన్‌గా నగదు అందజేసి రైతులకు అండగా నిలిచింది. అయితే అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్న సీఎం చంద్రబాబు మాత్రం ఆ విషయాన్నే మరిచారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



గత పాలనలో ప్రతి ఏటా ప్రతి రైతుకి రైతు భరోసా కింద నగదు మా బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. పెట్టుబడికి ఆసరాగా ఉంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పంట సాయం అందలేదు. సాగుకు అయ్యే ఖర్చుల కోసం అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందించాలి.

–మెరిగల సుందరరావు, రైతు, కాకుమాను

పెట్టుబడి సాయం అందించాలి



గత ప్రభుత్వం ప్రతి ఏడాది సాగుకు ముందుగానే రైతులకు రైతు భరోసా పథకం ద్వారా నగదు జమచేసింది.దీని వలన సాగు చేసే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు చేశారు.త్వరలోనే ఖరీఫ్ సీజన్ ముగిసి,రబీ సాగుకు రైతులు సిద్ధపడుతున్నారు.ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలి.

కొత్త అమేష్, రైతు, బీకే పాలెం

ప్రత్తిపాడులో కేటుగాళ్లు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో కేటుగాళ్లు తిరుగుతున్నారు. మాయమాటలతో బురిడీ కొట్టించి.. మంచికిపోయిన వారికి తమ చేతివాటాన్ని చూపుతూ జేబుల్లోని మొబైల్ ఫోన్‌లు కొట్టేస్తున్నారు కొందరు కంత్రీలు. వివరాలు.. సోమవారం రాత్రి ప్రత్తిపాడుకు చెందిన ఓ వ్యక్తి మెయిన్ రోడ్‌లోని ఓ కూల్‌డ్రింక్ షాపు వద్దకు వెళ్లి, చల్లని పానీయాలు తాగేందుకు వేచి ఉన్నాడు. అదే సమయంలో ఆ దుకాణం వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఇద్దరు కేటుగాళ్లు బండిని దుకాణం ఎదుట నిలిపి లోపలకు వెళ్లారు. కొంతసేపు అక్కడే అటుఇటు తిరుగుతూ రెక్కీ నిర్వహించారు. ఇంతలో ఒక కేటుగాడు బయటకు వెళ్లి ద్విచక్రవాహనం స్టార్ట్ చేశాడు. ఒక్కసారిగా బైక్‌ను పక్కకు వంచి పడిపోతుందని సాయం చేయాలని కేకలు వేశాడు. పాపం.. మంచికి పోయి సాయం చేద్దామని ఇద్దరు వ్యక్తులు బైక్ పైకిలేపేందుకు ముందుకు వెళ్లాడు. అప్పటికే లోపల ఉన్న మరో కేటుగాడు బైక్ వద్దకు వచ్చి బైక్ లేపుతున్నట్లుగా నటించాడు. సందట్లో సడేమియాగా ముందుగా రచించుకున్న ప్లాన్ ప్రకారం కేటుగాడు ఒక వ్యక్తి పైజేబులో ఉన్న సుమారు పాతిక వేల రూపాయల విలువైన మొబైల్ ఫోన్‌ను చాకచక్యంగా అపహరించి అక్కడి నుండి చెక్కేశారు. కొద్దిసేపటికి గమనించిన వ్యక్తి ఫోన్‌ను కొట్టేశారని గ్రహించి, ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించాడు.

చేతుల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



చేతుల పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎంపీడీఓ యుగకీర్తి



ప్రత్తిపాడు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాకుమాను: చేతుల పరిశుభ్రతతోనే ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ కె.యుగకీర్తి అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ యుగకీర్తి మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, తరువాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రస్తుతం గ్రామాలలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోజు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేఎఫ్ కెనడీ, హెచ్‌ఎం బి.సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఉపాధ్యాయిని జవహర్‌రాణి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రత్తిపాడు: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని ఎంపీడీఓ కె. శివపార్వతి అన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మంగళవారం పాఠశాలల్లో విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ శివపార్వతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్, గనికపూడి ప్రాథమిక పాఠశాల, యనమదల ఎల్ఈ పాఠశాల, కొండజాగర్లమూడి ప్రాథమిక పాఠశాలల్లో ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది చేతుల పరిశుభ్రతకు పాటించాల్సిన ఏడు రకాల విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ ఖాజా, స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ పర్సన్ డబ్బూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందరికీ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి



విజ్ఞాన్ నిరులాలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు



పెదనందిపాడులో..

గుంటూరు రూరల్: భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం యువతకు స్ఫూర్తి అని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక పేర్కొన్నారు. పెద్దపలకలూరు రోడ్డులోని కళాశాలలో ప్రపంచ విద్యార్థి దినోత్సవం మంగళవారం నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. జీఈ సంస్థ యూఎస్‌లో సీనియర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మాకినేని రుష్కర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు వివిధ పరిశ్రమల పనితీరు, వాటి సాంకేతిక అవసరాలు తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పుస్తక పఠనం అలవరచుకోవాలని సూచించారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం

కాకుమాను: ఏపీజేఅబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పి.సుభాషిణి పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



పాలపర్రులో రైతులకు వివరిస్తున్న ఏఓ సుధారాణి

పాలపర్రు(కాకుమాను): పత్తి, మిరప సాగు చేస్తున్న రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ బి.సుధారాణి అన్నారు. పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు, రాజుపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డాక్టర్ స్వాతి, వీఏఏలు పవన్ కుమార్, సుజాత పాల్గొన్నారు.

శ్రీరంగపురంలో పొలం పిలుస్తోంది

చేబ్రోలు: వరిలో కలుపు నివారణపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చేబ్రోలు మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాసనాయక్ అన్నారు. చేబ్రోలు మండలం శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసనాయక్, ఏఈఓ కె.సునీత, వీఏఏలు రత్నబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

చలపతి విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల అధ్యాపక బృందం

గుంటూరు రూరల్: తమ కళాశాల విద్యార్థులకు అందిస్తున్న విద్యావిధానాల ద్వారా గ్లోబల్ సర్టిఫికేషన్‌ను సాధిస్తున్నారని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలలోని ఏడుగురు విద్యార్థులు ఎస్ఏపీ గ్లోబల్ సర్టిఫికేషన్‌లో ఉత్తీర్ణత సాధించటం సంతోషంగా ఉందని చెప్పారు. ఎస్ఏపీ యూనివర్సిటీతో తమ కళాశాల ఒప్పందం చేసుకున్న సందర్భంగా ఎస్ఏపీ సర్టిఫైడ్ అసోసియేట్‌లో తమ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పొందిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ అభినందించారు.

ప్రీ స్కూల్.. నో బుక్స్

- అంగన్‌వాడీల్లో పుస్తకాలు ల్లేవ్
- గత ఏడాది పుస్తకాలతోనే చిన్నారులకు బోధన
- అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పాత ప్రీప్రైమరీ-1, ప్రీప్రైమరీ-2 పుస్తకాలు

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ చిన్నారులపై ప్రభుత్వం చిన్న చూపు ప్రదర్శిస్తోంది. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు బోధించే ప్రీ స్కూల్‌పై సీతకన్ను వేసింది. విద్యా సంవత్సరం ఆరంభమై దాదాపుగా నాలుగు నెలలు గడుస్తున్నా ప్రీ స్కూల్ పుస్తకాలు సరఫరా చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతోనే బోధించాల్సిన దుస్థితి.

నో న్యూ బుక్స్..

కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా రీతిలో మెరుగైన పాఠాలు బోధించేందు ప్రభుత్వం ప్రత్యేక పుస్తకాలను ముద్రిస్తోంది. నాలుగు సంవత్సరాల లోపు ప్రీ స్కూల్ చిన్నారులకు పాఠాలు బోధించేందుకు పీపీ–1 కిట్లు, ఐదేళ్ల లోపు పిల్లలకు పాఠాలు బోధించేందుకు పీపీ–2 కిట్లు పంపిణీ చేస్తున్నారు. కిట్లలో ఆంగ్లం, గణితం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ యాక్టివిటీ పుస్తకాలుంటాయి. వాటితో పాటు బర్డ్స్ –1 కిట్లు అందించేవారు. వీటి ద్వారా కథలు చెప్పడం, ఆట పాటలతో కూడిన విద్యను బోధించడం, సృజనాత్మకతను జోడించి వినూత్న పద్ధతుల్లో విద్యనందిస్తున్నారు. అంతటి కీలకమైన ప్రీ స్కూల్ పుస్తకాలను ఈ ఏడాది ఇప్పటి వరకూ సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

ప్రైవేటు వైపు తల్లిదండ్రుల చూపు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ బోధన ఆశించిన స్థాయిలో అందకపోవడంతో పాటు కనీసం ప్రభుత్వం పుస్తకాలను కూడా సరఫరా చేయకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు ఆసక్తిని చూపడంలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వేలకు వేలు వెచ్చించి ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల్లో చేర్పిస్తున్నారు. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ సెక్టార్‌ను ప్రోత్సహించేందుకే ఇలా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పుస్తకాలను సరఫరా చేయడం లేదన్న ఆరోపణలు తల్లిదండ్రులు, ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ఇదీ కేంద్రాలు, చిన్నారుల లెక్క..

ప్రాజెక్టు : ప్రత్తిపాడు

మండలాలు: ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, గుంటూరురూరల్

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	: 223
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	: 03
1–3 సంవత్సరాల చిన్నారులు	: 4,023
3–5 సంవత్సరాల చిన్నారులు	: 3,331
5–6 సంవత్సరాల చిన్నారులు	: 1,216

కొత్త పుస్తకాలు ఇంకా రాలేదు

2024–25 సంవత్సరానికి సంబంధించి ఇంకా కొత్త పీపీ-1, పీపీ-2 పుస్తకాలు రాలేదు. చిన్నారులకు ఇబ్బంది లేకుండా గత ఏడాది పుస్తకాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన చేస్తున్నారు. ఆటపాటలతో సృజనాత్మక పద్ధతిలో బోధన సాగుతోంది.

–వి.సుజాతదేవి, సీడీపీఓ, ప్రత్తిపాడు

శివాలయంలో పొట్టేల్ చిత్ర బృందం పూజలు



పూజలు చేస్తున్న నటీనటులు యువచంద్ర కృష్ణ, అనన్య

పెదకాకాని: కూతురు చదువు కోసం తండ్రి చేసే పోరాటమే పొట్టేల్ సినిమా సారాంశమని చిత్ర హీరో యువచంద్రకృష్ణ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేసేందుకు చిత్ర బృందం మంగళవారం పెదకాకాని చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం పొట్టేల్ సినిమా హీరో యువచంద్ర కృష్ణ మాట్లాడుతూ అక్టోబరు 25 తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతున్న పొట్టేల్ సినిమాను ప్రతి ఒక్కరూ చూసి విజయవంతం చేయాలని కోరారు. శివాలయానికి వచ్చిన వారిలో సినిమా హీరోయిన్ అనన్య నాగండ్ల తదితరులు పాల్గొన్నారు.

అధికారులు తీరుమార్చుకోవాలి

- ఎమ్మెల్యే రామాంజనేయులు హెచ్చరిక
- పంచాయతీ కార్యదర్శిపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం



పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కొమ్మూరు(కాకుమాను): అధికారుల తీరు మార్చుకోకుంటే కొమ్మూరు పంచాయతీ నుంచే ప్రక్షాళన మొదలెడతామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, అధికారులను హెచ్చరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమ్మూరులో మంగళవారం పలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం పంచాయతీకు సంబంధించిన నిధుల వినియోగంపై సాయంత్రం లోపు ఎంపీడీఓకు నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు పంచాయతీ కార్యదర్శిపై ఎమ్మెల్యే సమక్షంలోనే ఆరోపణలు చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన గ్రామ సభ కార్యక్రమంలో వీడు(కార్యదర్శిని ఉద్దేశించి)ముఖ్యమంత్రి పేరు కూడా ప్రస్తవించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫొటోలు, బ్యానర్లకే పరిమితం..

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళ, బుధవారాలలో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సంబంధిత శాఖ అధికారులు ఫొటోలు, బ్యానర్లతో పరిమితం చేస్తున్నారని పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు డీఏపీ, యూరియా కోసం అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగు చేసే ప్రతి రైతుకి సకాలంలో ఎరువులు అందించే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు

పెదకాకాని: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ టి.కృష్ణకాంత్ అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయం రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు, తరలింపు వంటి అంశాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐ కె.నారాయణ స్వామి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సివిల్ సప్లయి డీటీ వెంకట్రావు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్‌లో వివా విద్యార్థుల ప్రతిభ



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 9 సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివా ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్లో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థి బొల్ల సత్యేంద్ర, 6వ తరగతి విద్యార్థి బానాల ఇషాన్లు ప్రతిభ కనపరచి గుంటూరు జిల్లా జట్టు కాంస్య పతకాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. క్రీడలు మానసిక ఉత్తేజాన్ని కలుగజేస్తాయన్నారు. 9 మంది వ్యాయామోపాధ్యాయులతో క్రీడల్లో శిక్షణ ఇస్తోందన్నారు. రామచంద్రాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన బొల్ల సత్యేంద్ర, బానాల ఇషాన్లను, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎలీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ఐబీ సంధానకర్త కె.మాధవి, ఎస్పీఎస్పీ సంధానకర్త జ్యోతి మెట్లా, బాస్కెట్‌బాల్ కోచ్ టి.అనిల్‌కుమార్ అభినందించారు.